క్లుప్తంగా

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



కొత్తపల్లి: మండల కేంద్రంలో బీటీ రోడ్డు విస్తరణ పనులు శుక్రవారం ప్రారంభించారు. కోటకొండ నుంచి గుండుమాల్ వరకు 14.08 కిలో మీటర్ల రోడ్డు గుంతలమయంగా మారడతో మరమ్మతుకు రూ.38 కోట్లు మంజూరు కావడంతో మండల కేంద్రం నుంచి గుండుమాల్ వరకు ఆర్అండ్‌బీ డీఈ రాములు, ఏఈ బాల్‌రాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ చెన్నయ్య మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పార్థివ గౌడ్, నీలారెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హన్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాతన్‌పల్లిలో రక్తదాన శిబిరం



దామరగిద్ద: మండలంలోని క్యాతన్‌పల్లిలో మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా ముస్లిం మైనారిటీ జామియా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విజ్ఞాన దర్శిని తెలంగాణ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మహమ్మద్ ఆలీ ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించగా యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు షేక్ హసన్, మోయిన్, ఖాజా, శివకుమార్, రాములు నారాయణ, హన్మంతు పాల్గొన్నారు.

నిబంధనల ఉల్లంఘన.. కేసు నమోదు

దామరగిద్ద: వినాయక నిమజ్జనోత్సవాల్లో డీజే సౌండ్స్‌తో శద్ద కాలుష్యం సృష్టించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించినందుకు మొగుల్‌మడ్కకు చెందిన శివాజీయూత్, నంది వహనయూత్ కమిటీ సభ్యులపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. మండలంలోని మొగుల్‌మడ్క గ్రామంలో అనుమతులు లేకుండా డీజేలు వినియోగించి ప్రజలను ఇబ్బందులకు గురి చేయడంతో శివాజీ యూత్ వెంకటప్ప, శ్రీను, అంజప్ప, రాము, నందివాహన యూత్ సభ్యులు బుగ్గప్ప, బోయిన నరేష్, ఎల్లప్ప, చంద్రప్ప మొగులప్పపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ట్రాక్టర్, బైక్ ఢీ.. వ్యక్తి దుర్మరణం

మక్తల్: మండలంలోని లింగంపల్లి సబ్‌స్టేషన్ దగ్గర ట్రాక్టర్, ద్విచక్రవాహనం ఢీకొని ఊట్కూర్ మండలం చిన్నపొర్లకు చెందిన బోయే కర్ని అంబన్న (56) మృతిచెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామస్తుల కథనం మేరకు.. అంబన్న ఈ నెల 1న మక్తల్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా.. సబ్‌స్టేషన్ దగ్గర స్తంభం తీసుకెళ్తున్న ట్రాక్టర్ తగిలి కిందపడ్డాడు. దీంతో వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కృష్ణా: మండలంలోని నల్లగట్టు శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. మక్తల్ నుంచి రాయచూర్‌వైపు వెళ్తున్న కారు హిందుపూర్ వైపు వెళ్తున్న లారీని ప్రమాదవశాత్తు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బొలేరోలో తరలిస్తున్న చేపలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడడంతో పాటు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. మరో వైపు లారీ ముందు భాగం, లారీ టైర్లు పగిలిపోయాయి. ఈ ఘటనపై లారీ డ్రైవర్ జ్యోతిరామ్‌నాయక్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీద్ తెలిపారు.

అక్రమంగా మొర్రం తరలింపు

కృష్ణా: మండలంలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ముడుమాల్ నది తీరం నుంచి గత కొంత కాలంగా రాత్రిపగలు అనే తేడా లేకుండా మొర్రంను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మొర్రం తరలింపును అడ్డుకోవాలని పలుమార్లు తహసీల్దార్, ఎస్ఐకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



కోటకొండలో నిమజ్జన శోభాయాత్ర



ఊట్కూరులో నిమజ్జనానికి తరలుతున్న వినాయకులు

గణపతి బప్పా.. మోరియా



మక్తల్‌లో వినాయకుడిని దర్శించుకున్న మంత్రి సతీమణి వాకిటి లలితమ్మ



దామరగిద్దలో..



మక్తల్‌లో గణేశుడిని దర్శించుకుంటున్న భక్తులు

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండ, జాజాపూర్, సింగారం తదితర గ్రామాల్లో ప్రతిష్ఠించిన గణనాథులను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. నవరాత్రులు ఘనంగా పూజలు నిర్వహించి ప్రత్యేక వాహనంలో శోభాయాత్ర చేపట్టి కోలాటం ఆడుతూ ర్యాలీగా వెళ్లి నిమజ్జనం చేశారు. కోటకొండ నిమజ్జనం ఉత్సవాల్లో ఎస్పీ యోగేష్ గౌతమ్, అడిషనల్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పగడాకుల బాలస్వామి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

మంత్రి సతీమణి పూజలు

మక్తల్: పట్టణంలో ప్రతిష్ఠించిన గణనాథులను మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి వాకిటి లలితమ్మ అలాగే మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి వేర్వేరుగా దర్శించుకొని పూజలు నిర్వహించారు.

ఊట్కూరు: మండల కేంద్రంలో శుక్రవారం వినాయక నిమజ్జనోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. యువతి యువకులు భజనలు, కోలాటం, నృత్యాలు చేస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. ఉత్సవాలలో భాగంగా ఎస్పీ యోగేష్ గౌతమ్ బందోబస్తును పరిశీలించారు.

మద్దూరు: మండలంలో ఆయా వీధుల్లో ప్రతిష్ఠించిన గణనాథులు తొమ్మిది రోజుల పూజల అనంతరం గురువారం రాత్రి నిమజ్జనోత్సవానికి బయలుదేరి శుక్రవారం రాత్రి నిమజ్జనోత్సవం జరిగింది.

మాగనూర్: మండలంలోని వడ్వాట్, పర్మన్‌దోడ్డి, మాగనూర్, కోల్పూర్, వర్కూర్, నేరడగం, కొత్తపల్లి, మందిపల్లి, అమ్మపల్లి తదితర గ్రామాలలో గణపతి నిమజ్జనం వైభవంగా జరిపించారు.

కృష్ణా: మండలంలోని ముడుమాల్, టైరోడ్డు, గుడెబల్లూర్, హిందుపూర్, కున్సీ గ్రామాల్లో శుక్రవారం వినాయకుడి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు.

దామరగిద్ద: మండల కేంద్రమైన దామరగిద్ద, ఉడ్మల్‌గిద్ద తదితర అన్ని గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సామాజిక, సాంస్కృతిక, పురాణ ఇతిహాసాల సందేశాత్మక సన్నివేశాలతో వినాయకులను అలంకరించారు యువతి యువకులు నృత్యాలు చేస్తూ సంతోషంగా గడిపారు.



పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్



నాచారం లడ్డును దక్కించుకున్న యువసేన యూత్ అసోసియేషన్ సభ్యులు



మాగనూర్‌లో గణపతి నిమజ్జనం



ఊట్కూరులో వినాయక శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



ముడుమాల్‌లో వినాయకుడి నిమజ్జనంలో పాల్గొన్న యువకులు

'సీఎం సహాయనిధి' పేదలకు వరం



నర్వ: అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం సహాయనిధి వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్ అన్నారు. శుక్రవారం పాథర్చేడ్ కిష్టమ్మకు రూ.31,500 నాగిరెడ్డిపల్లి బోయ అనితకు రూ.52 వేలు, బుడ్డగాని తండా భుణావత్ కేశలమ్మకు రూ.60 వేలు మంజూరు కాగా చెక్కులను కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస చైర్మెన్ కృష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, వివేకవర్ధన్‌రెడ్డి, శరణప్ప, బోలుబండ వెంకటేష్, మహేష్, నెల్లికొండి వెంకటయ్య, చంద్రశేఖర్, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా చాపలి వెంకటేశ్

మక్తల్: జిల్లా ముదిరాజ్ సంఘం యువత అధ్యక్షుడిగా మక్తల్ మండలం ఖానపూర్ గ్రామానికి చెందిన చాపలి వెంకటేశ్ ఎన్నికయ్యారు. శుక్రవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్ద విజయకుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఎన్నిక నిర్వహించి అధ్యక్షుడిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాలమూరు జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, , పియుజేసి చేర్మేన్ గాసం నర్సిములు, రాము రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య యువజన సంఘం కమిటీ ఎన్నిక

మరికల్: ఆర్యవైశ్య మండల యువజన సంఘం కమిటీని శుక్రవారం మరికల్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆనంద్, ఉపాధ్యక్షుడిగా స్వామి, శశి, కార్యదర్శులుగా వంశీ, వెంకటేశ్, కోశాధికారిగా హర్షవర్ధన్, సహాయ కార్యదర్శులుగా ప్రకాష్, మధు, గణేష్, నరేష్, శ్రీహరి, అరుణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఆర్యవైశ్య మండల కమిటీ అధ్యక్షుడిగా వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా అశోక్, బాలస్వామి, కార్యదర్శిగా శేషాద్రి, దత్తు, సహాయ కార్యదర్శులుగా నాగరాజు, సింహాచలం, బీమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మిలాద్-ఉన్-నబీ వేడుకలు

అమరచింత: మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని ముస్లింలు మిలాద్-ఉన్-నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నబీసా మసీదులో మహ్మద్ ప్రవక్తకు సంబంధించిన కేశాలను ఆసర్ ముబారక్‌లో భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు భారీగా తరలివచ్చి కేశాలను దర్శించుకొని ప్రార్థనలు నిర్వహించారు.

సైబర్ మోసంలో పోయిన డబ్బులు రికవరీ

మక్తల్: పట్టణానికి చెందిన ఎండీ పజ్లూర్ రహిమాన్ ఇటీవల సైబర్ మోసానికి గురై రూ.లక్షకు పైగా నగదు పోగొట్టుకున్నాడు. అయితే పోయిన నగదు తిరిగి ఐదు రోజుల్లో జమ అయింది. వివరాల్లోకి వెళ్తే రహిమాన్‌కు వాట్సాప్‌లో ఆర్‌టీఓ చలాన్ పేరిట ఓ మెసేజ్ వచ్చింది. మెసేజ్‌పై క్లిక్ చేయడంతో ఈనెల 1న రూ.1.30 లక్షలు డెబిట్ అయ్యాయి. వెంటనే అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు 1930కి ఫోన్ చేసి సమాచారం అందించారు. ఈ క్రమంలో పోగొట్టుకున్న డబ్బులు శుక్రవారం బాధితుడి ఖాతాల్లో జమ అయినట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. పోయిన డబ్బులు తిరిగి రావడంతో బాధితుడు ఆనందంతో పోలీస్ స్టేషన్‌కు వాల్ క్లాక్ అందజేశాడు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయొద్దని పోలీసులు సూచించారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.



పోలీస్ స్టేషన్‌కు వాల్ క్లాక్‌ను బహూకరిస్తున్న బాధితుడు రహిమాన్

మురుగు కాల్వలు నిర్మించాలి

మాగనూర్: మండల పరిధిలోని పెగడబండ గ్రామంలో మురుగుతో ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామంలో మురుగు కాల్వలు ఏర్పాటు చేయకపోవడంతో మురుగు రోడ్డు పైనుంచి పారుతుంది. దీంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమల బెడద అధికంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలు నిర్మించి మురుగు సమస్య తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.



రేషన్ డీలర్ల హామీలు నెరవేర్చాలి

మాగనూర్: ప్రభుత్వం రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు బల్‌రెడ్డి కోరారు. రేషన్ డీలర్ల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండల వ్యాప్తంగా శుక్రవారం రేషన్‌షాపులను బంద్ చేశారు. అధికారంలోకి వస్తే రేషన్ డీలర్లకూ నెలకు రూ.5వేల చొప్పున వేతనం ఇస్తామి హామీ ఇచ్చి 18 నెలలైనా హామీని నెరవేర్చలేదన్నారు. ఇప్పటికైనా తమకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బల్‌రెడ్డి, నాగేశ్వరి, నారాయణ, నర్సింగమ్మ, శారద, అనిత, చంద్రకళ, శివరాజ్ , రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



బంద్ కార్యక్రమంలో పాల్గొన్న రేషన్ డీలర్లు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో శుక్రవారం ఆర్బీ డిపాజిటర్స్ సెమినార్ కార్యక్రమం ద్వారా ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నారాయణ కళాజాతా బృందం ఆటపాటలతో బ్యాంకుల్లో ఆర్థిక లావాదేవీల వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలక అవగాహన కల్పించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించి సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని వివరించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శేఖర్‌రెడ్డి, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి గురువులే మార్గదర్శకులు



సర్వేపల్లి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయులు




నర్వ మండల ఉపాధ్యాయులను సన్మానించిన పీఆర్టీయూ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు.

- నారాయణపేటలో ఎమ్మార్సీ కార్యాలయం ముందు పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. డీఈఓ గోవిందరాజు ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు యాద్గీర్ జనార్దన్ రెడ్డి, నాయకులు సత్యనారాయణ, నారాయణరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.
- మద్దూరులోని పాఠశాలలు, కళాశాలల్లో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాగనూర్‌కు చెందిన పలువురు ఉపాధ్యాయులు మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో శుక్రవారం ఎంఈవో ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించి ప్రశంసాపత్రాలు, మెమొంటోలను అందజేశారు.
- నర్వలోని పెద్దకడ్మూర్ ఉన్నత పాఠశాలకు చెందిన జీహెచ్‌ఎం భాగ్యలక్ష్మీ, కొత్తపల్లి పీఎస్ పాఠశాలకు చెందిన రాఘవరెడ్డి, ఉందేకోడ్ ఎంపీపీఎస్ పాఠశాలకు చెందిన సుశాంతి, పాథర్చేడ్ ఎంపీపీఎస్‌కు చెందిన రఘువర్మ గౌడ్‌లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడంతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.
- మక్తల్‌లోని బాలుర ఉన్నత పాఠశాలలో రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం అనిల్‌గౌడ్, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, విశ్రాంతి ఉద్యోగులు గోపాలం, నాగప్ప,చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అథ్లెటిక్ కోచ్ అజయ్‌కు సన్మానం

నారాయణపేట టౌన్: జిల్లా అథ్లెటిక్ కోచ్ అజయ్‌ను జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమణ ఆధ్వర్యంలో క్రీడాకారులు శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చెన్నారెడ్డి, నాగేష్, రవి నాయక్, అశోక్, క్రీడాకారులు పాల్గొన్నారు.



మక్తల్‌లో ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ముమ్మరంగా ఇళ్ల నిర్మాణాలు



మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

- నిర్మాణాలకు ఆసక్తి కనబరుస్తున్న లబ్ధిదారులు
- 476 మందికి మొదటి విడత బిల్లులు మంజూరు

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు నియోజకవర్గంలో జోరుగా కొనసాగుతున్నాయి. జిల్లాలో ఉమ్మడి కోస్గి, మద్దూరు మండలాల్లో నూతన మండలాలుగా ఏర్పాటైన కొత్తపల్లి, గుండుమాల్ మండలాల్లోనూ నిర్మాణాలు ఊపందుకున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కావడంతో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నాలుగు మండలాలకు 1580 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారు. అలాగే నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసుకొని లబ్ధిదారులు త్వరగా నిర్మించుకునేలా అవగాహన కల్పించడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు.

మండలాల వారీగా ఇళ్ల వివరాలు

కోస్గిలో మొత్తం 457 మందికి ఇళ్లు మంజూరు కాగా 391 మంది నిర్మాణాలు ప్రారంభించారు. వీరిలో 122 మంది బేస్‌మెంట్ లెవల్ వరకు 18 మంది రూఫ్ లెవల్ అలాగే ఏడుగురు ఆర్‌సీసీ లెవల్ వరకు పూర్తి చేసుకున్నారు. మద్దూరు మండలంలో 446 మందికి ఇళ్లు మంజూరు కాగా 348 మంది ఇళ్లను ప్రారంభించి వివిధ దశల్లో నిర్మించుకుంటున్నారు. అలాగే కొత్తపల్లిలో 279 మందికి 183 మంది నిర్మాణాలు చేపట్టారు. గుండుమాల్‌లో 408 మందికి గాను 290 మంది ఇంటి నిర్మాణాలను మొదలుపెట్టారు.

సంతోషంగా ఉంది



మేమే 20 ఏళ్లుగా ఉన్న కొద్ది స్థలంలో బండలు వేసుకొని ఉంటున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఇల్లు మంజూరు కావడంతో ఇటీవల నిర్మాణం చేపట్టాం. నిర్మాణం లెంటల్ లెవల్ వరకు పూర్తి కావడంతో మొదటి విడత బిల్లు కూడా మంజూరైంది. సొంతింటి కల సాకారం అవుతుండడంతో చాలా సంతోషంగా ఉంది.

–మోహన్ రెడ్డి, కొత్తపల్లి

476 మందికి బిల్లులు మంజూరు



సీఎం సొంత నియోజకవర్గం కావడంతో నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి పెట్టాం. నిబంధనల మేరకు నిర్మించుకున్న 476 మందికి ఇప్పటికే మొదటి విడత బిల్లులు మంజూరు చేశాం. ఇంకా ఎవరైనా నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు ఉంటే త్వరగా పనులు ప్రారంభించాలి. నిర్మాణాలు ప్రారంభిస్తే విడతల వారీగా డబ్బులు వారి ఖాతాల్లో జమ చేస్తాం.

– శంకర్ నాయక్, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్